వరంగల్ : హరిద్రా జగత్ ప్రసూతి అలంకరణలో భద్రకాళీ అమ్మవారు

హరిద్రా అలంకరణలో భద్రకాళీ అమ్మవారు

నేటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

వరంగల్, అక్టోబర్ 2 : చారిత్రక ఓరుగల్లు నగరంలోని ప్రసిద్ధ భద్రకాళీ ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు అంకురార్పణ జరిగింది. బుధవారం ఉదయం నిత్యాహికం నిర్వర్తించిన అనంతరం అమ్మవారికి జగత్ప్రసూతి అలంకారం చేసి భక్తులకు హరిద్రా రూపంలో దర్శనం కల్పించారు. అమావాస్య రోజు అమ్మవారికి 40కిలోల స్వచ్ఛమైన హరిద్రా (పసుపు)తో అభిషేకం చేశారు.

సిద్ధేశ్వరాలయంలో..

హనుమకొండ : పద్మాక్షికాలనీలోని సిద్ధేశ్వరాలయంలో గురువారం నుంచి దేవీ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమవుతాయని అర్చకుడు సిద్ధేశుని సురేశ్‌కుమార్ తెలిపారు. ప్రతి రోజు భవానీ మాతకు ప్రత్యేక అభిషేకం, పల్లకీ సేవ, కుంకుమార్చన, అన్నపూజ, అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. ఉత్సవాల్లో పాల్గొనే వారు అర్చకులు లేదా 9848073571 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

మల్లన్న ఆలయంలో..

ఐనవోలు : ఐనవోలు మల్లికార్జున స్వామి ఉప దేవాలయం భ్రమరాంభికా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను ఈ నెల 3 నుంచి 12వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు తెలిపారు. భక్తులు రూ.516 చెల్లించి పూజా కార్యక్రమంలో పాల్గొనాలన్నారు.

ఐనవోలు : మల్లన్న ఆలయంలోని భ్రమరాంబికాదేవి అమ్మవారు

సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ ప్రారంభం

ఆత్మకూరు, అక్టోబర్ 2 : గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. బుధవారం హౌసుబుజుర్గు గ్రామంలో సెంట్రల్ లైటింగ్ సిస్టమ్‌ను ప్రారంభించారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీలను నెరవేరుస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మార్క సుమలత, మాజీ సర్పంచ్ రాజు, మాజీ ఎంపీటీసీలు కమలాపురం రమేశ్, పరికిరాల వాసు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లినర్

★ సెప్టిక్ ట్యాంక్ క్లినర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-318996

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా వివాంచు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

ఎల్కతుర్తి : బతుకమ్మ ఆడుతున్న మహిళలు

ఐనవోలు : మండల కేంద్రంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

దామెర : కోగిల్వాయిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

శాయంపేట : సూరంపేటలో కోలాటం ఆడుతున్న మహిళలు

ఒక్కేసి పువ్వేసి చందమామ..

- జిల్లా వ్యాప్తంగా బతుకమ్మ పండుగ ప్రారంభం
- మొదటి రోజు ఎంగిలిపూల వేడుకలు
- ఆలయాలు, చెరువుల వద్ద ఆడిపాడిన మహిళలు

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 2 : జిల్లా వ్యాప్తంగా బతుకమ్మ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. బుధవారం మొదటి రోజు ఎంగిలిపూల బతుకమ్మను మహిళలు జరుపుకున్నారు. ఉదయం ఇండ్లలో తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి, సాయంత్రం ఆలయాలు, చెరువుల వద్దకు వచ్చి ఆడిపాడారు. అనంతరం నిమజ్జనం చేశారు. నగరంలోని చారిత్రక వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు వైభవంగా జరిగాయి. వేలాది మంది మహిళలు ఆలయ ప్రాంగణానికి బతుకమ్మలతో తరలివచ్చారు. ఒక్కేసి పువ్వువేసి చందమామ అంటూ ఆడిపాడారు. ఈ సందర్భంగా రాధేశ్యాం సాహితీసంస్థ ఆధ్వర్యంలో బతుకమ్మ పాటల పోటీలు నిర్వహించినట్లు ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ తెలిపారు. కార్యక్రమంలో వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సతీమణి నాయిని నీలిమారెడ్డి, వారి కూతురు శ్రీగోదాదేవి పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. పోటీల్లో ప్రథమ బహుమతి కే సరస్వతి, ద్వితీయ బహుమతి ఆకారపు అరుణ, తృతీయ బహుమతి ఎం భార్గవి గెలుచుకున్నారు. అలాగే, 90 మందికి కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రాధేశ్యాం సాహితీ సంస్థ సభ్యులు రావుల సుదర్శన్, పులి రజినీకాంత్, ఆలయ ఈవో వెంకటయ్య, వెంకట్ పాల్గొన్నారు. అలాగే, ఐదో డిజిన్ హనుమాన్ నగర్ ఫేజ్-1 కాలనీలో కూడా మహిళలు ఘనంగా బతుకమ్మ వేడుకలు నిర్వహించారు.

కాజీపేటలో..

కాజీపేట : పట్టణంలోని పలు ఆలయాలు పితృ అమావాస్యను పురస్కరించుకొని భక్తులతో కిక్కిరిసి పోయాయి. రైల్వే దేవాలయ సముదాయం, వడ్డేపల్లి ట్యాంక్ బాండ్ సుబ్రహ్మణ్య స్వామి దేవాలయం, ప్రశాంత్‌నగర్‌లోని రామాలయం, దర్గాలోని రామాలయం, సోమిడిలోని సోమేశ్వస్వామి, భక్తాంజనేయస్వామి, డీజిల్ కాలనీలోని అభయాంజనేయస్వామి దేవాలయాలకు మహిళు ఎంగిలిపూల బతుకమ్మలను తీసుకవచ్చిన ఆడిపాడారు. ఈ సందర్భంగా ఆలయాల వద్ద కమిటీ నిర్వహకులు విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండ సీఐ సుధాకర్‌రెడ్డి నేతృత్వంలో ఎస్సైలు , నవీన్‌కుమార్, లవన్‌కుమార్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

నగరంలోని వేయిస్తంభాల దేవాలయానికి బతుకమ్మలతో తరలివస్తున్న మహిళలు

పరకాలలో..

పరకాల : పట్టణంలోని పశువుల సంత ఆవరణలో మహిళలు బతుకమ్మ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ మేరకు మున్సిపల్ పాలకవర్గం ఏర్పాట్లు చేసింది. పట్టణంలోని పహిళలు, యువతులు భారీ ఎత్తున బతుకమ్మలతో తరలివచ్చి, ఆడిపాడారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు :మండలంలోని గ్రామాల్లో మహిళలు మొదటి రోజు ఎంగలి పూల బతుకమ్మను పేర్చారు. మండల కేంద్రంలో రాత్రి పోచమ్మ సెంటర్‌లోని గుడి వద్ద నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి పాల్గొని మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దామెరలో..

దామెర : మండలంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కోగిల్వాయి, పులుకుర్తి, ఊరుగొండ, దామెర, ఓగులాపురం, ముస్త్యాలపల్లి, తక్కళ్లపహాడ్, ల్యాదెళ్ల గ్రామాల్లోని ముఖ్య కూడళ్లు, ఆలయాల బతుకమ్మలను పెట్టి మహిళలు పూజలు చేశారు. కోలాటమాడుతూ పాటలు పాడారు. అనంతరం వాయినాలు ఇచ్చి పుచ్చుకున్నారు.

శాయంపేటలో..

శాయంపేట : మండలంలోని అన్ని గ్రామాల్లో బతుకమ్మ వేడుకలు ప్రారంభమయ్యాయి. శాయంపేటలోని శ్రీమత్స్యగిరిస్వామి ఆలయం, శ్రీవెంకటేశ్వర శివమార్కండేయ స్వామి ఆలయం, సూరంపేటలోని హనుమాన్ ఆలయంతో పాటు అన్ని గ్రామాల్లోని ఆలయాల్లో ఎంగిలిపూల బతుకమ్మను ఆడారు. బతుకమ్మ..బతుకమ్మ ఉయ్యాలో అంటూ యువతులు, పెద్దలు ఉత్సాహంగా ఆడారు. అనంతరం ఒకరికొకరు వాయినాలు ఇచ్చుకున్నారు. ఎస్సై ప్రమోద్‌కుమార్ బందోబస్తు నిర్వహించారు.

ఎల్కతుర్తిలో..

ఎల్కతుర్తి : మండల వ్యాప్తంగా బతుకమ్మలను సాయంత్ర వేళల్లో గ్రామ కూడళ్లు, దేవాలయాలు, చెరువుల వద్దకు తీసుకొచ్చి మహిళలు ఆడిపాడారు. ఈ వేడుకల్లో మహిళలు భారీ ఎత్తున పాల్గొన్నారు. కాగా, బతుకమ్మ ఆడే ప్రదేశాల్లో పంచాయతీ కార్యదర్శులు అన్ని రకాల వసతులను ఏర్పాటు చేశారు.

ఎస్వీఎస్ కళాశాలలో..

హసన్‌పర్తి : భీమారంలోని ఎస్వీఎస్ ఇంజినీరింగ్ కళాశాలలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు బతుకమ్మను పేర్చి ఆడిపాడారు. ముఖ్యఅతిథులుగా ఎస్వీఎస్ కళాశాలల వైస్ చైర్మన్ డాక్టర్ ఎర్రబెల్లి సువర్ణ, డాక్టర్ హర్షిణి హాజరై విద్యార్థినులతో ఆడి ఆడారు. ఈ సందర్భంగా విద్యార్థినులు, మహిళలకు కాలేజీ చైర్మన్ బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు.

ఐనవోలులో..

ఐనవోలు : మండలంలోని పున్నేల్, ఐనవోలు, ఒంటిమామిడిపల్లి, నందనం, వెంకటాపురం, గర్నిళ్లపల్లి, కొండపర్తి, పంథిని, పెరుమాండ్లగూడెం, ఉడుతగూడెం, వనమాలకనపర్తి తదితర గ్రామాల్లో మహిళలు బతుకమ్మ వేడుకలు జరుపుకున్నారు. గ్రామాల్లోని ఆలయాల వెళ్లి ఆడిపాడారు. పంచాయతీ కార్యదర్శులు పండుగకు ఏర్పాట్లు చేశారు.

హనుమకొండ చౌరస్తా : వేయిస్తంభాల గుడిలో బతుకమ్మ పాటల పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంపీ కడియం కావ్య



ఆత్మకూరు : బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

పరకాల : మైదానంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

మడికొండలోని నెహ్రూనగర్‌లో బతుకమ్మలతో మహిళలు

హసన్‌పర్తి : బతుకమ్మలతో ఎస్వీఎస్ కాలేజీ విద్యార్థినులు

కాజీపేట : బతుకమ్మ ఆడుతున్న మహిళలు

హనుమకొండ చౌరస్తా : హనుమాన్‌నగర్‌లో..

'బాలగోపాల్ సంస్మరణ సదస్సును విజయవంతం చేయండి'

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 2 : ఈ నెల 6న సుందరయ్య విజ్ఞాన కేంద్రం బాగ్‌లింగంపల్లిలో డాక్టర్ బాలగోపాల్ వర్ధంతి సందర్భంగా నిర్వహించే సదస్సును విజయవంతం చేయాలని మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ బాదావత్ రాజు పిలుపునిచ్చారు. సదస్సు పోస్టర్లు బుధవారం హనుమకొండలోని అంబేద్కర్ సర్కిల్‌లో ఆవిష్కరించారు. మానవ హక్కుల వేదిక రాష్ట్ర కార్యదర్శి హరికృష్ణ, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు అద్దునూరి యాదగిరి, ప్రధాన కార్యదర్శి దిలీప్, జిల్లా కార్యదర్శి వెంకటనారాయణ, బండి కోటేశ్వరరావు, పద్మజ, సత్యం, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ముగ్గురు దొంగల అరెస్ట్

సుబేదారి, అక్టోబర్ 2 : దోపిడీలకు పాల్పడుతున్న దొంగల ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. లష్కర్ సింగారానికి చెందిన జన్ను రాజ్‌కుమార్(23), పోచమ్మమైదాన్‌కు చెందిన కట్కురి యాకూబ్ (30), కట్కూరి రేణుక (22)ను పోలీసులు అరెస్ట్ చేసి రూ.900 నగదు, సెల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం హనుమకొండ ఏసీపీ దేవేందర్ రెడ్డి వివరాలు వెల్లడించారు. దేవన్నపేట గ్రామానికి చెందిన బాధితుడు సెప్టెంబర్ 30న మధ్యాహ్నం గోపాల్‌పూర్ క్రాస్ రోడ్డు వద్ద ఆటో కోసం వేచి చూస్తుండగా ముగ్గురు దొంగలు ఒక్కసారిగా అతడిపై దాడి చేసి, తీవ్రంగా గాయపరిచి, ఆటోలో పోచమ్మకుంట శ్మశానం వైపు తీసుకెళ్లారు. మరోసారి తీవ్రంగా కొట్టి అతడి వద్ద నుంచి రూ.10 వేలు, సెల్‌ఫోన్‌ను లాక్కొని, ఫోన్ నుంచి గూగుల్ పే ద్వారా మరో రూ.వెయ్యి తీసుకున్నారు. అనంతరం నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. బాధితుడు హనుమకొండ పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేపట్టి, హనుమకొండ బస్‌స్టేషన్ వద్ద నిందితులను గుర్తించి, అరెస్ట్ చేసినట్లు ఏసీపీ తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన ఇన్‌స్పెక్టర్ సతీశ్, ఎస్ఐ సతీశ్, కానిస్టేబుళ్లను అభినందించారు.

వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ దేవేందర్‌రెడ్డి

ఇంట్లో పురుడు పోసిన '108' సిబ్బంది

తల్లీబిడ్డ క్షేమం.. కక్కిరాలపల్లిలో ఘటన

ఐనవోలు, అక్టోబర్ 2 : భార్యకు పురిటినొప్పులు వస్తున్నాయని భర్త 108కు ఫోన్ చేయగా, ఇంటికి చేరుకున్న హెల్త్ సిబ్బంది పురిటినొప్పులు ఎక్కువకావడంతో మహిళను పరీక్షించి ఇంట్లోనే పురుడు పోశారు. మండలంలోని కక్కిరాలపల్లి గ్రామానికి చెందిన కాటబోయిన రాజు అతడి భార్య భార్గవి పురిటి నొప్పులతో బాధపడుతుండగా 108 వాహనానికి ఫోన్ చేశాడు. అయితే లోకల్‌లో ఉన్న 108 వాహనాలు బిజీగా ఉండడంతో ఐఆర్సీఎస్‌లో ఉన్న 108 వాహనం కక్కిరాలపల్లికి చేరుకుంది. సదరు మహిళకు పురిటినొప్పులు ఎక్కువ కావడంతో ఈఎంటీ చైతన్య, పైలెట్ వెంకటేశ్ ఇంట్లోనే డెలివరీ చేయించారు. భార్గవి మగ శిశువుకు జన్మనిచ్చింది. అనంతరం తల్లీబిడ్డలను సీకేఎం హాస్పిటల్‌లో చేర్పించారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉండడంతో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు.

భార్గవికి డెలివరీ చేసిన 108 వాహన సిబ్బంది

రోడ్డుపై బతుకమ్మతో మహిళల నిరసన

హనుమకొండ, అక్టోబర్ 2 : నగరంలోని కేఎల్ఎన్‌రెడ్డి కాలనీకి సంబంధించిన కమ్యూనిటీహాల్ స్థలాన్ని ఆక్రమించారని బుధవారం రోడ్డుపై బతుకమ్మ ఆడి స్థానిక మహిళలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు వీరారెడ్డి, కార్యదర్శి మాధవరెడ్డి, ట్రెజరర్ సత్యనారాయణరెడ్డి, కన్వీనర్ కిషన్‌రెడ్డి, అడ్వైజర్లు నాయిని లక్ష్మారెడ్డి, వీ రవీందర్ మాట్లాడుతూ 1983లో పీఆర్‌టీయూ సొసైటీ ద్వారా 7.20ఎకరాలలో కేఎల్ఎన్‌రెడ్డి కాలనీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్లాట్లు, రోడ్లు పోగా కమ్యూనిటీ హాల్, గుడి కోసం కేటాయించిన 9 గుంటల స్థలంలో ఏటా గణపతి నవరాత్రి ఉత్సవాలతో పాటు మహిళలు బతుకమ్మ ఆడేవారన్నారు. కమ్యూనిటీ హాల్‌కు కేటాయించిన స్థలాన్ని కాలనీకి సంబంధం లేని కొందరు సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులమంటూ రామకృష్ణ సేవా సమితి పేరున గిఫ్ట్ డీడ్‌తో 2011లో రిజిస్ట్రేషన్ చేసినట్లు తెలిపారు. తర్వాత రామకృష్ణ సేవా సమితి ఈ స్థలాన్ని స్వాధీనం చేసుకొని భవన నిర్మాణం చేపట్టిందని, దీంతో కాలనీ మహిళలు బతుకమ్మ ఆడేందుకు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా కాలనీకి చెందిన కమ్యూనిటీ హాల్‌ను అప్పగించాలని వారు డిమాండ్ చేశారు.

కాలనీలో రోడ్డుపై బతుకమ్మ ఆడుతూ నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

రైల్వే క్వార్టర్స్‌లోని శాస్త్రి విగ్రహానికి పూలమాల వేస్తున్న రైల్వే ఎంప్లాయిస్ జాక్ చైర్మన్ కొండ్ర నర్సింగరావు

శాస్త్రిని ఆదర్శంగా తీసుకోవాలి

కాజీపేట, అక్టోబర్ 2 :మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి నిజాయితీని యువత ఆదర్శంగా తీసుకోవాలని తెలంగాణ రైల్వే ఎంప్లాయిస్ జాక్ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్ అన్నారు. కాజీపేట ఈఎల్ఎస్ క్వార్టర్స్‌లో శాస్త్రీ 120వ జయంతిని బుధవారం నిర్వహించారు. పలువురు శాస్త్రీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజకీయంగా ఉన్నత పదువులు అలంకరించినా ఎలాంటి స్వార్థానికి చోటివ్వకుండా నిజాయితీకి మారు పేరుగా నిలిచారన్నారు. రైల్వే జాక్ చైర్మన్ కొండ్ర నర్సింగరావు, రిటైర్డ్ రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ సెక్రటరీ గుర్రపు సుధాకర్, ఎంకే మూర్తి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజలకు అవగాహన కల్పిస్తున్న నిట్ విద్యార్థులు

స్వచ్ఛతపై నిట్ విద్యార్థుల అవగాహన

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 2 : గాంధీ జయంతి సందర్భంగా నిట్ ప్రొఫెసర్లు, విద్యార్థులు ఉన్నత భారత అభియాన్ కార్యక్రమంలో భాగంగా కమలాపూర్ మండలం శంభునిపల్లి గ్రామ ప్రజలకు స్వచ్ఛత, పచ్చదనం గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో విద్యార్థులు, ప్రజలతో ర్యాలీ నిర్వహించి గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రాంతీయ సంచాలకులు ఆచార్య హీరాలాల్, ఆచార్య కోలా ఆనంద్‌కిశోర్, సర్పంచ్ రవీందర్‌రెడ్డి, గ్రామ కార్యదర్శి సాహిత్ పాల్గొన్నారు. అలాగే నిట్‌లో గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

'పర్యావరణానికి జీవం పోస్తున్న వాసవి క్లబ్‌లు'

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 2 : వాసవి క్లబ్‌లు పర్యావరణానికి జీవం పోస్తున్నారని కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి అన్నారు. సెప్టెంబర్ 28న వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ కోటి సీడ్ బాల్స్‌ను తయారు చేసి బుధవారం దేశంలోని వివిధ ప్రాంతాల్లో వెదజల్లడం అభినందనీయమన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయ జాతీయ సేవా పథకం వలంటీర్లతో వాసవి క్లబ్ వరంగల్ సహకారంతో ఉసిరి, కుంకుడు, ఖర్జూర, దానిమ్మ, సీతాఫలం, రేగుపండు, గంగి రేగుపండు, ఆముదం విత్తనాలతో తయారు చేసిన 20వేలకుపైగా విత్తన బంతులను బుధవారం కేయూ క్యాంపస్‌లో వెదజల్లే కార్యక్రమాన్ని మాజీ మేయర్ గుండా ప్రకాశ్‌రావు ప్రారంభించారు. పాలక మండలి సభ్యులు సురేశ్‌లాల్, చిర్రా రాజు, దూరవిద్య కేంద్ర సంచాలకులు రామచంద్రం, అభివృద్ధి అధికారి వాసుదేవారెడ్డి, మామిడాల ఇస్తారి, అవెన్యూ ప్లాంటేషన్ ఇన్‌చార్జి వెంకటయ్య, మహిళా ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ భిక్షాలు, వ్యాయమ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్, చరిత్ర విభాగాధిపతి రాజ్‌కుమార్, జాతీయ సేవా పథకం ప్రోగ్రాం ఆఫీసర్ రాధిక, విశ్రాంత ఆచార్యులు రామేశ్వరం, వాసవి క్లబ్ వరంగల్ బాధ్యులు మల్యాల వీరమల్లయ్య, పుల్లూరు కిశోర్, ప్రొఫెసర్ గుంటూరు వెంకటనారాయణ, తోట మార్కండేయ, మానెపల్లి సుధాకర్, వల్లాల నాగేశ్వర్, పిన్న ఈశ్వర్, అప్పని జయప్రకాశ్ పాల్గొన్నారు.

మహిళ పేరుపైనే ప్రభుత్వ పథకాలు

భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

శాయంపేట, అక్టోబర్ 2 : రాష్ట్ర ప్రభుత్వం మహిళల పేరుపైనే పథకాలను అందిస్తుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శాయంపేటలోని మండల పరిషత్‌లో బుధవారం 62 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ కింద మంజూరైన రూ.62.07లక్షల విలువైన చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ శాయంపేటలో రోడ్డు విస్తరణలో ఇండ్లు కోల్పోయిన నిర్వాసితులకు మహిళల పేరు మీద దసరా పండుగకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. 400 చదరపు గజాల్లో ఇల్లు కట్టుకోవాలని, ఇల్లు కట్టుకోలేని వారికి తానే కట్టిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ కల్వల సత్యనారాయణ, ఎంపీడీవో ఫణిచంద్ర, మాజీ ఎంపీపీ బాసాని చంద్రప్రకాశ్, పరకాల ఏఎంసీ వైస్ చైర్మన్ మారపల్లి రవీందర్ పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

కొండా సురేఖ వ్యాఖ్యలు అర్థరహితం

హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే సతీశ్ కుమార్

భీమదేవరపల్లి, అక్టోబర్ 2 : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు అర్థరహితమని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్ కుమార్ మండిపడ్డారు. మంత్రి హోదాలో ఉండి సురేఖ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఏంటని ప్రశ్నించారు. సురేఖ రాజకీయ ప్రత్యర్థులపై ఇలా దాడి చేయడం హేయమైన చర్య అని అభివర్ణించారు. రాజకీయాల్లో వ్యక్తిగత ఆరోపణలు చేయొద్దని, తిరిగి భవిష్యత్‌లో ఇలాంటి వ్యాఖ్యలకు ఆస్కారం ఇవ్వొద్దని పేర్కొన్నారు. బాధ్యత గల పదవిలో ఉండి మంత్రి బాధ్యతారాహితంగా మాట్లాడటం సరికాదని ఒక ప్రకటనలో హెచ్చరించారు.

అఖిల్ గౌడ్‌ను అభినందించిన దాస్యం

హనుమకొండ, అక్టోబర్ 2 : జాతీయ స్థాయి బాక్సింగ్(సీబీఎస్సీ క్లస్టర్ అండర్ - 17 విభాగం) పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకం సాధించిన బాక్సర్ అఖిల్ గౌడ్‌ను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అభినందించారు. వడ్డేపల్లి నివాసంలో బుధవారం అఖిల్ గౌడ్‌ను సత్కరించారు. కోచ్ ప్రవీణ్, తల్లిదండ్రులను అభినందించారు. మాజీ కార్పొరేటర్, భారత జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాస్యం విజయ్ భాస్కర్, అరవింద్ ఆర్య, పేరిణి అశోక్ పాల్గొన్నారు.

అఖిల్ గౌడ్‌ను అభినందిస్తున్న దాస్యం వినయ్‌భాస్కర్

హౌస్ ఆఫ్ జాయ్‌లో పండ్ల పంపిణీ

కాజీపేట, అక్టోబర్ 2 : ఫాతిమానగర్‌లోని మానసిక దివ్యాంగుల ఆశ్రమం హౌస్ ఆఫ్ జాయ్‌లో గాంధీ జయంతి సందర్భంగా బుధవారం రాత్రి సీపీ అంబర్ కిశోర్ ఝా మానసిక దివ్యాంగులు, వృద్ధులకు పండ్లు, స్వీట్లను పంపిణీ చేశారు. ఆయన వెంట కాజీపేట సీఐ సుధాకర్‌రెడ్డి, ఎస్సై నవీన్‌కుమార్ ఉన్నారు.

పండ్లను పంపిణీ చేస్తున్న సీపీ

జగన్‌మోహన్‌రావును సన్మానిస్తున్న టీఎన్జీవోలు

జగన్ మోహన్‌రావుకు టీఎన్జీవోల సన్మానం

హనుమకొండ, అక్టోబర్ 2 : రాష్ట్ర కో ఆపరేటివ్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఎన్నమనేని జగన్మోహన్ రావును టీఎన్‌జీవోస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో బుధవారం సన్మానించారు. హనుమకొండలో జరిగిన కార్యక్రమంలో పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. టీజీవో జిల్లా కార్యదర్శి ప్రవీణ్ కుమార్, టీఎన్‌జీవోస్ జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షుడు పుల్లూరు వేణుగోపాల్, రాష్ట్ర నేతలు శ్యామ్‌సుందర్, లక్ష్మీప్రసాద్, సారంగపాణి, జిల్లా నేతలు సురేశ్, రామ్ ప్రసాద్, రాజేశ్‌ఖన్నా, రామాంజనేయులు, రాజేశ్వర్‌రెడ్డి, భగవాన్‌రెడ్డి, శ్రీనివాస్, రాజీవ్, అనూప్, కృష్ణ, గౌతం, ఎర్రప్రగడ తదితరులు పాల్గొన్నారు.